# జిల్లా విద్యాశాఖాధికారిగా సదానందం

**-ప్రజాపక్షం కథనానికి స్పందన**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జిల్లా విద్యాశాఖాధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. సదానందం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భూసేకరణ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జి. సదానందం జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని రెండు నెలల పాటు సెలవుపై వెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ప్రజాపక్షం దినపత్రికలో సారధి లేని విద్యాశాఖ అంటూ ప్రత్యేక వార్తా కథనాన్ని ప్రచురించడం జరిగింది. విద్యాశాఖ అధికారి లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బదులను కథనంలో వివరించడంతో ఉన్నతాధికారులు స్పందించి విద్యాశాఖాధికారిని నియమించడం జరిగింది. విద్యాశాఖాధికారి నియామకం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 17 | జూన్ | 2026 పేజీలు : 8


# ఏది ప్రత్యామ్నాయం..!?



**-సందిగ్ధతలో రైతాంగం**

**-అపరాల సాగుతో సరిపెట్టుకుంటారా..?**

**-వరికి స్థానే ఏ పంట.. ఆలస్యమవుతున్న ఖరీఫ్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నారు. సాంప్రదాయ పంటల సాగుకు సానుకూలత లేదంటున్నారు. ఏ పంటకు ఏది ప్రత్యామ్నాయం అని తేల్చుకోలేక రైతులు ఖరీఫ్ ముంగిట ఆలోచనలో పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలతో పాటు వరి, మొక్కజొన్న, అపరాలు కొద్ది శాతంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. గడిచిన ఐదారు సంవత్సరాలలో పామాయిల్ సాగు గణనీయంగా పెరిగింది. గతేడాది వానా కాలం, ఎండాకాలం రెండు సీజన్లలోనూ వరి రైతులకు లాభసాటి పంటగా మారింది. వరి సాగు చేసిన రైతులు కాస్త సంతోషంగానే ఉన్నారు. వరి సాంప్రదాయ పంట. దానికి ప్రత్యామ్నాయంగా వేరే పంటలు సాగు చేయడం అంత సులభం కాదు. వరిని వంపు నేలలు, తేలిక నేలలతో పాటు పదునెక్కువగా ఉండి నీరు నిల్వ ఉండే భూముల్లోనే సాగు చేస్తున్నారు. వరి తప్ప మరో పంట సాగు చేయడం కుదరదు. వరి సాగు తగ్గించవచ్చునేమో కానీ వరికి ప్రత్యామ్నాయంగా మరో పంట సాగు చేయడం కుదరదు. కొన్ని సంవత్సరాలుగా నీటి వసతి కలిగిన మెట్ట భూముల్లో రెండవ పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో పత్తి,

మిగతా 2లో..

# ఉపాధ్యాయుడు ఒక్కరే విద్యార్థి



**-మెరుగుపడని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి**

**-పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మండల కేంద్రానికి అత్యంత సమీపంలో ఉంటుంది. సుమారు 800 మంది జనాభా కలిగిన గ్రామం. ఓటర్లే గత పంచాయతీ ఎన్నికల నాటికి 666 మంది. కానీ ఆ ఊరు ప్రాథమిక పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయుడు, ఒక్కరే విద్యార్థి. ఇదెక్కడో మారుమూల కాదు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజక వర్గం చింతకాని మండలం రేపల్లేవాడ గ్రామంలోని పాఠశాల పరిస్థితి. బడిఈడు పిల్లలు పెద్ద సంఖ్యలో ఉన్న ఆ గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడికి వచ్చేందుకు

మిగతా 2లో..

# ఫైనాన్స్ సంస్థల మాయాజాలం..!




**-అసైన్డ్ భూములకు తప్పుడు ధృవీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్లు**

**-డాక్యుమెంట్ రైటర్లను శాసిస్తున్న మాఫియా**

**-పదికి పైగా సంసల్లో తప్పుడు డాక్యుమెంట్‌లు ఉన్నట్లు సమాచారం**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలో అసైన్డ్ భూములను లక్ష్యంగా చేసుకుని కొందరు హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేయించేందుకు తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా లభిస్తున్న సమాచారం ప్రకారం, అసైన్డ్ భూములపై నిర్మించిన ఇళ్లకు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేపట్టి, ప్రైవేట్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల ద్వారా రూ.10 లక్షలకు పైగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సత్తుపల్లి పట్టణంతో పాటు మండలం, వేంసూరు, కల్లూరు, పెనుబల్లి ప్రాంతాల్లో ఈ వ్యవహారం విస్తరించిందని స్థానికులు చెబు తున్నారు.ఫైనాన్స్ సంస్థలు నిర్దేశించే లక్ష్యాలను చేరుకునేందుకు కొందరు సిబ్బంది తప్పుడు పత్రాలను సృష్టిస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కొందరు డాక్యుమెంట్ రైటర్లు సహకరిస్తున్నారని, ప్రతి ఫైల్‌కు భారీ మొత్తంలో కమీషన్లు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.అయితే ఈ వ్యవహారంలో అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే, రుణం మంజూరైనా, కాకపోయినా దరఖాస్తుదారుల నుంచి కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు రావడం. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది. మరోవైపు, అక్రమ మార్గంలో సమర్పించిన పత్రాలు పరిశీలనలో విఫలమవడంతో కొన్ని రుణ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని సమాచారం. దీంతో డబ్బులు చెల్లించిన

మిగతా 2లో..

# ఏది ప్రత్యామ్నాయం..!?

(మొదటిపేజీ తరువాయి)

అపరాలు సాగు చేసిన రైతులు రబీలో మొక్కజొన్న సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండవ పంటగా సాగు చేస్తున్న వాటిలో మొక్కజొన్న తప్ప మిగిలిన ఏ పంట దిగుబడి ఆశాజనకంగా లేదు. ఇప్పుడు మొక్కజొన్న కాకుండా అంటే రైతులు ఇబ్బంది పడవల్సిందే.

### కలిసి రాని అపరాల సాగు :

రైతులు సాంప్రదాయ పంటలైన పెసర, మినుము, కంది మొదలైన పంటలను సాగు చేయడం మానేశారు.రాను రాను వీటి సాగు శాతం గణనీయంగా తగ్గిపోతుంది. పెసర, మినుము పంటలను వర్షాకాలంలో సాగు చేస్తే అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా దిగుబడి రావడం లేదు. గతేడాది పెసర, మినుము సాగు చేసిన రైతులకు విత్తనం కూడా తిరిగి రాలేదంటే అతిశయోక్తి కాదు. అందుకే అపరాల సాగు పట్ల ఆసక్తి కనబర్చడం లేదు. కంది పునాస పంట. స్వల్పకాలిక రకాలు కందులలో వచ్చిన రెండవ పంట సాగు చేయాలనుకునే వారు కందిపట్ల మొగ్గు చూపడం లేదు. దీనికి తోడు తెగుళ్లు ముఖ్యంగా వైరస్ అపరాల సాగుకు అవరోధంగా మారింది.

### వద్దన్న పంటలతోనే లాభాలు :

ఎందుకో తెలియదు కానీ గడిచిన పదేళ్లలో శాస్త్రవేత్తలు, అధికారులు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో ఏ పంట సాగు చేయవద్దని చెబుతారో ఆ పంటే అధిక దిగుబడివచ్చిరైతులు లాభసాటి సాగుగా మారుతుంది. అధికారులు సూచించిన పంటలు సాగు చేసిన రైతులు నష్టపోతున్నారు. కారణాలు, దిగుబడులు పక్కనపెడితే వ్యవసాయ రంగంలో ఆధునీకత అవసరమే. వర్షాపాతానికి అనుగుణంగా పంటలు సాగు చేయాల్సి ఉంది. వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి మొదలైన పంటలకు ప్రత్యామ్నాయం ఎన్నుకోవడం రైతులకు కష్టమే. ఉద్యానవన పంటలకు సంబంధించి ఇప్పటి వరకు రైతులకు ఇబ్బంది లేదు. మామిడి, పామాయిల్, నిమ్మ, జామా, ఇతర పండ్ల తోటల సాగు పట్ల రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. రైతులను మరింత చైతన్యపర్చడం, రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వాడటంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే చేసుకు చేవ రైతుకు రొక్కం చేకూరుతాయి.

### ఆలస్యమవుతున్న ఖరీఫ్ :

ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్యమవుతుంది. జూన్ మూడవ వారంలోకి వచ్చిన ఇంత వరకు సరైన వర్షం కురవ లేదు. రైతులు దుక్కులు సిద్ధం చేసి విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. పొడిలో విత్తితే మొలక రాదన్న అభిప్రాయంతో సిద్ధం చేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే సూచనలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచార నేపథ్యంలో రైతులు ఆలోచనలో పడ్డారు. చినుకు ఆలస్యమయ్యే కొద్దీ దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధ్యాయుడు ఒక్కరే విద్యార్థి ఒక్కరే

(మొదటిపేజీ తరువాయి)

సుముఖత వ్యక్తం చేయడం లేదు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సుల్లో ఇతర చోట్లకు వెళ్తున్నారు. బడిబాట కార్యక్రమం నిర్వహించినా ఫలితం దక్కలేదు. గతేడాది ఇద్దరు విద్యార్థులు ఉండగా ఐదవ తరగతి పూర్తి కావడంతో ఒకరు వెళ్లిపోవడంతో ఇప్పుడు ఒకరే మిగిలిపోయారు. ఇప్పుడు అది ఏక ఉపాధ్యాయ, ఏక విద్యార్థి పాఠశాలగా మారింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అందరూ ఐక్యమై ఏకగ్రీవం చేసుకున్నారు. కానీ పాఠశాల విషయంలో మాత్రం ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు విద్యాబోధన చేస్తుండగా దుగ్గిరాల స్రవంతి మాత్రమే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్ తండాలో సైతం ఒక్కరే ఉపాధ్యాయుడు ఒక్కరే విద్యార్థి ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి నానాటికి తీసికట్టు నానంబొట్టు అన్న చందంగా తయారైంది. ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేకపోవడం విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేకపోవడం కూడా ప్రభుత్వ విద్యకు శాపంగా మారింది. కూసుమంచి మండలంలో నేలపట్ల ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో రెండు తరగతులు నిర్వహిస్తుండగా గైగొళ్లపల్లి పంచాయతీ చింతలతండాలో ఒకే గదిలో మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇదే గ్రామంలో ఒకే గదిలో మూడు పాఠశాలలను నిర్వహిస్తుండడం కూడా చర్చనీయాంశమైంది. ముదిగొండ మండలం పండ్రేగుపల్లి ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. గతేడాది పదవ తరగతి పరీక్ష రాసి ఎనిమిది మంది విద్యార్థులు ఉన్నత తరగతులకు వెళ్లగా ఈ ఏడాది అతి కష్టం మీద బడిబాట ద్వారా ఏడుగురిని పాఠశాలలో స్థానిక ఉపాధ్యాయులు చేర్పించగలిగారు. ఇక్కడ ఉపాధ్యాయ బృందాన్ని అభినందించాల్సిన విషయం ఏమిటంటే ఒక ఆటోను ఉపాధ్యాయులే ఏర్పాటు చేసి పాఠశాలలకు విద్యార్థులను రప్పిస్తున్నారు. ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకుని పాఠశాలలను బలోపేతం చేస్తే తప్ప ప్రైవేటు మోజుతో ప్రభుత్వ పాఠశాలల వైపు చూసే పరిస్థితి లేదు.

# సరిహద్దు భూ వివాదాల పరిష్కారానికి చర్యలు



**-అటవీ, రెవెన్యూ భూములపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అటవీ, రెవెన్యూ సరిహద్దు భూ వివాదాలు పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టివిస్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం డిఎఫ్‌వో అనూజ్ అగర్వాల్ లతో కలిసి అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ, రెవెన్యూ భూ సరిహద్దుల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శాఖల సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో సిఏ ల్యాండ్స్ మ్యుటేషన్, ఫారెస్ట్, రెవెన్యూ సరిహద్దుల వివాదాలు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల భూముల సమస్యల గురించి క్షేత్రాధికారులను అడిగి తెలుసుకున్నారు. జాయింట్ సర్వే చేపట్టే ముందు అటవీ, రెవెన్యూ అధికారులు కూర్చుని గైడ్‌లైన్స్ ప్రేమ్ చేసుకుని సర్వే చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్‌వో సిహెచ్ రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వోలు, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫైనాన్స్ సంస్థల మాయాజాలం..!

(మొదటిపేజీ తరువాయి)

పలువురు బాధితులు మోసపోయామని వాపోతున్నారు. ఈ ఆరోపణల్లో నిజానిజాలు వెలుగులోకి రావాలంటే సత్తుపల్లి పట్టణంలో, తిరువూరులో పనిచేస్తున్న ఫిన్‌కేర్, ఫైవ్ స్టార్, చోళ, ఆప్టాస్, వెరిటాస్, ఐఎఫ్ఎల్, ధన్ మిత్రా, నేస్టావియా, ఎస్‌బిఎఫ్‌సీ, డీసీబీ, సుందరం, మణపురం తదితర సంస్థల కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఆయా సంస్థల రికార్డులు, రుణాలకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారెవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్సీ బాలికల వసతి గృహంలో అడిష్మన్లు ప్రారంభం

**-మూడో తరగతి నుంచి పదవ తరగతి వరకు సీట్లు ఖాళీ**

ప్రజాపక్షం/బోనకల్: మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలికల వసతి గృహంలో 2026 2027 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు బోనకల్ ఎస్సీ బాలికల వసతి గృహ సంక్షేమ అధికారిణి జి వినోద తెలిపారు. ఎస్సీతో పాటు ఎస్టీ, బిసి, మైనారిటీ, ఓసీ విద్యార్థులకు మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వసతి, భోజన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులను కోరారు. వసతి గృహంలో చేరిన విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహార భోజనం, నాలుగు జతల దుస్తులు, నోట్‌బుక్స్, పదోతరగతి స్టడీ మెటీరియల్, బ్లాంకెట్, కార్పెట్, స్వెటర్, బ్లాక్‌షూ, స్పోర్ట్ షూ, స్కూల్‌బ్యాగ్, ప్లేట్, గ్లాస్, ట్రంక్ బాక్స్ తదితర సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా ఏడో తరగతి వరకు చదివే విద్యార్థులకు నెలకు రూ.175, ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు నెలకు రూ.275 చొప్పున సబ్బు, ఆయిల్ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. విద్యార్థులకు సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ లైబ్రరీ, క్రీడా సామాగ్రి , ప్రతి నెల వైద్య పరీక్షలు, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక ట్యూటర్ల సేవలు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వసతి గృహంలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పాటు అందించాలని సంక్షేమ అధికారిణి వినోద సూచించారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం బోనకల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన గల హాస్టల్‌లో లేదా సెల్ నెంబర్ 9866343466ను సంప్రదించాలని ఆమె కోరారు.

# విజబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేయాలి

**- రూరల్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సిపి సునిల్‌దత్**



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన విజబుల్ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేయాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఖమ్మం రూరల్ సబ్‌డివిజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో సబ్‌డివిజన్ అధికారులతో నేరసమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. స్టేషన్ హౌస్ అఫీసర్లు నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలన్నారు. నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన వంటి ప్రతికూల ధోరణులకు అడ్డుకట్టవేయాలని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తు దెబ్బతినకుండా మత్తుపదార్థల వినియోగం, రవాణాను అడ్డుకోవాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుత వర్షకాలం సీజన్‌లో రైతుకు నష్టం కలిగించే నకిలీ విత్తనాల క్రయ విక్రయాలపై నిఘ ఉంచి వాటిని అరికట్టాలన్నారు. ఆంధ్ర నుంచి తెలంగాణకు అక్రమ ఇసుక రవాణాకు కట్టడి చేసేందుకు సహద్దులో చెక్ పోస్ట్ వద్ద ఇరవై నాలుగంటలు వాహనతనిఖీలు విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టుబడిన వాహనాలను తక్షణమే కేసులు నమోదు చేసి జరిమానాలు విధించి అవసరమైతే వాహనాలను జప్తు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి తగు చర్యల తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషన్ డిసిపి భోజా రామానుజం, రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి



ప్రజాపక్షం/మంచుపల్లి: కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలని ఏఐటియుసి నాయకులు అన్నారు. మంగళవారం ఉదయం పీవీకే 5 గనిలో ఏర్పాటు చేసిన పిట్ కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ కార్మికులను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా మార్చే విషయంలో రాజీలేఐన పోరాటం చేస్తున్నది ఏఐటియుసి యూనియన్ మాత్రమేనని, కార్మికులను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలనున ఇతర యూనియన్లు చేపట్టడాన్ని పీవీకే 5 గని పిట్ కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. పీవీకే5 గనిలో జరిగిన ఐఎన్‌టియుసి గేట్ మీటింగ్‌లో ఏఐటియుసీ యూనియన్‌పై చేసిన విమర్శలను పిట్ కమిటీ ఖండించారు. ఈ సమావేశంలో పిట్ కార్యదర్శి సందీప్ సేత్, పిట్ ఉపాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ సాయి పవన్, సేఫ్టీ కమిటీ సభ్యులు రామచందర్, సురేందర్ రెడ్డి, సంజీవ్, ప్రశాంత్, హరికృష్ణ, ఈర్ల కృష్ణ, సురేష్, రవీందర్, రాజేష్, కోటేశ్వరరావు, మహేష్, రామారావు, కార మోహన్, మదనయ్య, ముబారక్, మేకల శీను, మహేష్, సంతానం తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీఆర్‌జీ బిల్లును రద్దు చేయాలి



ప్రజాపక్షం/కారేపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీఆర్‌జీ బిల్లులను రద్దు చేసి, ప్రస్తుతం అమలులో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెం గ్రామ పంచాయితీలో ఉపాధి హామీ కార్మికులతో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీల అధికారులను కేంద్రీకరించే విధంగా కొత్త బిల్లును తీసుకువచ్చారని విమర్శించారు. దీని వల్ల గ్రామీణ ప్రాంత కార్మికులకు ఉపాధి దినాలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం జూన్ 23న ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ ఖమ్మం జిల్లా సమితి సభ్యుడు ఉంగరాల సుధాకర్, నాయకులు కట్టికోలా వెంకటేశ్వర్లు, సైదులు, కిరణ్, సీతారాములు, జారే కోటమ్మ, సాయిదమ్మ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటును కాపాడుకోవాలి

**-బూత్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**
**-అవగాహన కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ, ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా బూత్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం జిల్లా ఇంచార్జి, ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీంధర్, ఖమ్మం నియోజక వర్గ ఇంచార్జి ఏనుగుల రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రఘునాథపాలెం మండలం ఖానాపురం హవేలీ, టూటౌన్ , వన్‌టౌన్, త్రీటౌన్ ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సభ్యులకు ఎస్ఐఆర్ ప్రక్రియ, డిజిటల్ సభ్యత్వ నమోదుపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జిల్లా ఇంచార్జి, ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీంధర్ మాట్లాడుతూ ప్రతి ఓటును కాపాడే బాధ్యత బిఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులపై ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఓటర్లకు అవసరమైన ధృవపత్రాలు, ఇబ్బందులు ఎదురైతే వాటిని సమకూర్చడంలో సహకరించాలన్నారు. 2002 సంవత్సరం ఓటరు జాబితా ఆధారంగా అవసరమైన వివరాలను పరిశీలించి సంబంధిత పత్రాలను నిర్ణీత గడువు లోపు సమర్పించేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం ప్రజలకు, పార్టీ శ్రేణులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. బూత్ కమిటీ సభ్యులకు, ఓటర్లకు ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్రే అత్యంత కీలకమన్నారు. పార్టీకు సంబంధించి సభ్యత్వ నమోదును కూడా డిజిటల్‌గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, వీరునాయక్, శీలంశెట్టి వీరభద్రం,బత్తుల మురళీ, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండల అభివృద్ధి, భూ సమస్యలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఎమ్మెల్యే రాగమయి దయానంద్. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రెవెన్యూ అధికారులు, ఆర్ఐలు, జీపీఓల నుంచి ఎమ్మెల్యే వివరాలు తెలుసుకున్నారు. గ్రామ సెక్రటరీలు, జీపీఓలు, హౌసింగ్ ఏఈల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తూ గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అలాగే రేషన్ కార్డుల కోసం ఇంకా దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే ఎటువంటి ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. అతి త్వరలో రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త సర్వే నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో,



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులకు సూచించారు.

## అమానుష ఘటనలు నాగరిక సమాజానికి మచ్చ

**-ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు**

**ప్రజాపక్షం/ఖమ్మం:** నగరంలో 12 సంవత్సరాల అమాయక బాలికపై జరిగిన అత్యాచార ఘటన సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఇటువంటి అమానుష ఘటనలు నాగరిక సమాజానికి మచ్చగా నిలుస్తాయని శ్రీరక్షా సంస్థ అధినేత డాక్టర్ గోంగూర వెంటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా 30 నుంచి 40 రోజుల వ్యవధిలోనే విచారించి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ డా జివి ఆధ్వర్యంలో ఖమ్మం ఫ్రీడమ్ పార్క్‌లో వాకర్స్ క్లబ్ సభ్యులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా జివి మాట్లాడుతూ బాలికపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజంలో పెరుగుతున్న నైతిక విలువల క్షీణతకు సంకేతమని పేర్కొన్నారు. చిన్నారుల భద్రత ప్రతి కుటుంబం, సమాజం మరియు ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలంటే వేగవంతమైన విచారణతో పాటు నిందితులకు చట్టపరంగా కఠిన శిక్షలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వాసవి క్లబ్




సభ్యులు కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, మహిళలు మరియు బాలికల భద్రత మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాల అమలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, మరియు బాధితులకు తక్షణ న్యాయం అందే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు సామాజిక కార్యకర్తలు, వాకర్స్ క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొని బాధిత బాలికకు సంఘీభావం ప్రకటించారు.

## జాతీయ రహదారికి భూసార పరీక్షలు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నాగపూర్ అమరావతి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసార (మట్టి నాణ్యత) పరీక్షలు చేపట్టారు. మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం నూతన కలెక్టరేట్ సమీపంలో శివ దాబా ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కన హైవే నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఏజెన్సీ బాధ్యులు గత కొద్ది రోజులుగా మట్టి నమూనా పరీక్షలు చేపట్టారు. 200 అడుగుల లోతు వరకు బోర్ డ్రిల్లింగ్ జరిపి మట్టి నమూనాలు సేకరిస్తున్నారని తద్వారా రహదారి నిర్మాణానికి అనువుగా భూమి అనుకూలంగా ఉంటుందా అనేది భూసార పరీక్షల ద్వారా పరీక్షిస్తున్నారు. ఇటీవల అదే ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు సంబంధించిన భూముల్లో మట్టి నమూనాలు సేకరిస్తుండగా అట్టి భూములకు సంబంధించి కోర్టు ఉత్తర్వులు ఉన్నందున పనులు చేపట్టవద్దని రైతులు, ప్లాట్ యజమానులు పనులను అడ్డుకున్నారు. దీనితో భూసార పరీక్షలు నిర్వహించే ఏజెన్సీ బాధ్యులు ప్రధాన రహదారి పక్కనే భూసార పరీక్షలు నిర్వహించడం గమనార్హం. ప్రధాన రహదారి పక్కన పరీక్షలు నిర్వహిస్తే ఎవరు అడ్డుకునే అవకాశం ఉండదని ఈవిధంగా పనులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.



## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**-ఏవో ఉమామహేశ్వరరెడ్డి**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో పలు విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర రెడ్డి తనిఖీలు నిర్వహించారు. విత్తన దుకాణాల్లో ఉన్నటువంటి విత్తనాలకు సంబంధించి ఇన్‌వాయిస్‌లు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డులో ఉన్న వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేని కంపెనీ విత్తనాలు అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో సంతకం చేసినటువంటి రశీదును ఇవ్వాలన్నారు. దిగుబడి వచ్చే నమ్మకమైన విత్తన రకాలను మాత్రమే విక్రయించాలన్నారు. రైతులు కూడా గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు అమ్మే వారి పట్ల తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకుని దానిని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.

## రాజీతో సమస్యను పరిష్కరించుకోండి

**-ఈనెల 20న జాతీయ లోక్ అదాలత్ : సిఐ ఉస్మాన్ షరీఫ్**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రాజీతో సమస్యను పరిష్కరించుకోవాలని ఈనెల 20న జరిగే రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. సిపి సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌పై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులకు సంబంధించి కక్షిదారులు రాజీ చేసుకోవాలని సూచించారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా, ఆస్తి విభజన, కుటుంబ పరమైన, వైవాహిక జీవితానికి సంబంధించి, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసులలో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజమార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృధా చేసుకోవద్దన్నారు. జ్యూడిషియల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరు వర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీపడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలనుకునే వారు పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు.

## రైతు భరోసా నిధులు తక్షణమే విడుదల చేయాలి

**జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల**



**ప్రజాపక్షం/చింతకాని :** వానాకాలం సీజన్ మొదలైనందున రైతులకు రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో వంకాయలపాటి లచ్చయ్య నివాసంలో ఏర్పాటు చేసిన బారాస ముఖ్య కార్యకర్తల సమావేశంలో కమల్‌రాజు మాట్లాడుతూ యాప్‌తో సంబంధం లేకుండా రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని, మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న సంబంధించి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. రైతులకు విత్తనాల కొనుగోలు సమయం ఆసన్నమైనందున రైతుభరోసా వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంకెన రమేష్, మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్, తిరుమలాపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, గడ్డం శ్రీను, పిన్నెల్లి శ్రీను, తిరుపతి కొండలరావు, సిలార్ సాహెబ్, కుటుంబరావు, శెట్టి సురేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని కోయచలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో హెచ్ఎం శిరీష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బలుసుపాటి శేషయ్య, ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు లు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం పంపిణీని చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చెరుకూరి పూర్ణచందర్‌రావు, అమరం అప్పారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యపై స్పందించిన సర్పంచులు




ప్రజాపక్షం/కారేపల్లి: భాగ్యనగర్ తండా గ్రామంలోని సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫ రాను భాగ్యనగర్ తండాకు చెందిన లకావత్ లక్ష్మి నిలిపివేయడంతో, ఆ మార్గం ద్వారా విద్యుత్ పొందుతున్న పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేప థ్యంలో భాగ్యనగర్ తండా, ఉసిరికాయల పల్లి, పొలంపల్లి, గుట్టకింది గుంపు, అప్పాయిగూడెం గ్రామాల సర్పంచులు ఉమ్మడిగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వెంటనే తమ గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు. ఈసందర్భంగా సర్పంచులు ప్రజలకు అవస రమైన విద్యుత్ సేవలను అడ్డుకోవడం సరికాదని, సమస్యను అధికారులు త్వరితగతిన పరి ష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరా లాల్, ఉసిరికాయలపల్లి సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి , పొలంపల్లి సర్పంచ్ దారావత్ హేమ లత, గుట్టకింద గుంపు సర్పంచ్ ఉండం రాఘవులు, అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, నాయకులు గుగులోత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గోటు విలేజ్ ఎమ్మార్పీఎస్ 40 రోజుల కార్యచరణ



ప్రజాపక్షం/మణుగూరుః పద్మశ్రీ అవార్డు గ్రహీత మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గోటు విలేజ్ కార్యక్రమాన్ని మంగళవారం మ ణుగూరు మండల పరిధిలోని అరుంధతి నగర్ గ్రామంలో ఎంఆర్‌పిఎస్ మణుగూరు మండల అధ్యక్షులు పొడుతూరి కళ్యాణ్ బాబు మాదిగ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమ నికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పినపాక నియోజకవర్గ ఇన్చార్జిగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా సీనియర్ నాయకులు కొమ్ము హుస్సేన్ మాదిగ ఈ గో టు విలేజ్ కార్యక్రమాన్ని అలానే నూతన జండా దిమ్మెలు మరియు గ్రామ నూతన కమిటీలుమధ్యలో చదువుని ఆపే సిన పిల్లలని తిరిగి మరల స్కూలకు మరియు కాలెజీలకు పంపే విధంగా ఆ యొక్క గ్రామ కమిటీల సభ్యులు తప్పనిసరిగా ప్రోత్సహించి పిల్లల్ని పై చదువులకు పంపాలని ఈ కార్య క్రమంలో చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెన్నం ఆనందరావు, నిఖిల్, ప్రమోజ్, బన్ను, చింటూ, నాని, తేజాస్విని, శ్రీజ, రమణ, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

## అసౌకర్యాలకు కేరాఫ్ సిపిఎస్ పాఠశాల



ప్రజాపక్షం/గుండాల : విద్యాసంవత్సరం ప్రారంభమై రెండురోజులు కావస్తున్న మండల కేంద్రంలోని సిపిఎస్ పాఠశాలకు ఎలాంటి మౌళిక సదుపాయాలు లేకపోవ డంతో విద్యార్థులు ఇటు ఉపాధ్యాయులు నాన అవస్థలకు గురికావాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొంది . పాఠశాలలో విద్యుత్ సౌకర్యంలేక చీకటి గదులల్లో విద్యాబోధన కొనసాగు తోంది, ఉక్కపోతకు చెట్లనీడలో విద్యాబోధన చెయ్యాల్సి వస్తుందని ఉపాధ్యాయులు ఆవే దన వయక్తం చేస్తున్నారు. ఇటీవల ఒక స్వచ్చంద సంస్థవారు పాఠశాలకు పెయింట్ వేశా రని దీనితొ కొంచెం పాఠశాల కళవచ్చిందని లేకుంటే పాడుపడ్డ బంగాను తలపించే విదంగా ఉండేదని ఉపాధ్యాయులు తెలిపారు. అలాగే కనీసవసతులైన విద్యార్థులకు మరు గుదొడ్లు , కిచెన్‌షెడ్డు గత రెండు సంవత్సరాలుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని పూర్తి స్థాయిలో నిర్మాణం కాకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలకు ఆరుబయటకు వెల్లా ల్సిన దుస్థితి ఉంది,. మహిళా ఉపాధ్యాయులు పక్కనే ఉన్న బాళికల హాస్టల్ కు వెలుతున్న పరిస్థితి . దీనికితోడు కోతుల బెడద తీవ్రంగా ఉంది, విద్యార్థులు బయటకు వెల్లిన సంద ర్భంలో కోతులు దాడిచేస్తే మాపరిస్థితి ఏమిటని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా సిపిఎస్ పాఠశాలలో నెలకొన్న ప్రాదాన సమస్యలు విద్యుత్, టైలెట్స్, వంటషెడ్డును పూర్తిచేసే విదంగా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితం డ్రులు , ఉపాధ్యాయులు వేడుకొంటున్నారు.

## ఆపదలో అండగా..ఉద్యోగ సంఘం



ప్రజాపక్షం/కారేపల్లి: 2017 నుంచి సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్న గుంపెల్లగూడెం ఉద్యోగ సంఘం మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. చిన్నకట్టుగూడెం గ్రామానికి చెందిన లకావత్ రాములు వెన్నుముక సమస్యతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటంతో, అతని కుటుంబానికి సంఘం రూ 5,000 ఆర్థిక సహాయం అందజేసింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన ఉద్యోగులతో ఏర్పాటైన ఈ సంఘం ఇప్పటి వరకు పేద కుటుం బాల ఆడపిల్లల వివాహాలు, ఒంటరి మహిళలు, ఇళ్ల నిర్మాణం వంటి అవసరాలకు ప్రతి కుటుంబానికి రూ 5,000 చొప్పున సహాయం అందిస్తూ సేవలు కొనసాగిస్తోంది. ఈ సంద ర్భంగా ఉద్యోగ సంఘం అధ్యక్షుడు బానోత్ వీరన్న మాట్లాడుతూ 2017 నుంచి సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సహ కారం వల్లే ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని అన్నారు. ఈకా ర్యక్రమంలో ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి గుగులోత్ శంకర్, కార్యవర్గ సభ్యులు టీచర్ బానోత్ వీరన్న, అశోక్, వినోద్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## 'బడి బాట'ను సమర్థవంతంగా నిర్వహించాలి

**-కలెక్టర్ దివాకర టిఎస్**





ప్రజాపక్షం/కారేపల్లి: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకుండా బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పాఠశాలలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం సింగరేణి మండల పరిధిలో గల విశ్వానాథపల్లి గ్రామం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ ప్రక్రియను సమీక్షించి, ప్రతి విద్యార్థికి అన్ని సౌక ర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదే శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడి బాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పాఠశాల వయస్సుఏ గల ప్రతి చిన్నారిని గుర్తించి పాఠశాలల్లో నమోదు చేయాలని తెలిపారు. ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు తీసుకురావాలని సూచిం చారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతాయు తంగా విధులు నిర్వర్తించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాల న్నారు. పాఠశాల వంటగది, మధ్యాహ్న భోజన పథకం అమలును పరి శీలించి, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆహార పదా ర్థాల నిల్వ, వంట ప్రక్రియ, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక పాఠ శాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులకు అంది స్తున్న పోషకాహారం, ప్రీ స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య సేవల అమలుపై ఆరా తీశారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని, పిల్లలకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిస రాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహ సీల్దార్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవే ఈ దంపతులకు పరమాన్నం..!

**-అందరికీ ఆప్తులు ఎమ్మెల్యే దంపతులు**
**మట్టా రాగమయి విజయకుమార్ దంపతులు**



ప్రజాపక్షం/సత్తుపల్లిః సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రజాసేవకు కొత్త నిర్వచనం చెబుతున్న దంపతులు ఎవరైనా ఉన్నారంటే అది ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, దయానంద్ విజయకుమార్ దంపతులేనని ప్రజలు చెబుతున్నారు. పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, సేవనే పరమా న్నంగా భావిస్తున్న ఈ దంపతులు నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. గెలుపొందిన నాటి నుంచి ప్రజలకు అందు బాటులో ఉంటూ, ముఖ్యంగా పేదల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం వీరి ప్రత్యేకతగా మారింది. పేదల బాధ లను తమ బాధలుగా భావిస్తూ, వారి కుటుంబ సభ్యుల్లా అండగా నిలు స్తున్నారు. కూడు, గూడు లేని నిరుపేదలకు ఆశ్రయం కల్పించి, వారిని సమాజంలో గౌరవప్రదమైన స్థాయిలో నిలబెట్టాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు గౌరవంగా జీవించాలంటే వారికి సొంత ఇల్లు ఉండాలనే భావనతో ఎమ్మెల్యే దంపతులు కృషి చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇల్లులేని కుటుం బాలకు నివాస స్థలాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. నియోజకవ ర్గంలో ఇప్పటికే 3,500కు పైగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించి, వాటిలో అనేక ఇళ్లకు గృహప్రవేశాలు జరగడం వారి నిబద్ధ తకు నిదర్శనంగా నిలుస్తోంది. వేలాది కుటుంబాల జీవితాల్లో వెలు గులు నింపిన అభివృద్ధి యజ్ఞంగా ప్రజలు అభివర్ణిస్తున్నారు. పట్టణం లోని వేశ్యకాంతుల చెరువు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు ఎన్నో సంవత్సరాలుగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. గతంలో ఏ నాయ కుడూ ఆ భూముల వైపు దృష్టి సారించకపోవడంతో అవి కబ్జాదారుల చెరలోకి వెళ్లాయి. అయితే ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే దంపతులు ఆ భూములను గుర్తించి, పేదల ఇళ్ల స్థలాల కోసం వినియోగించాలనే సంకల్పంతో చర్యలు చేపట్టారు. కాలు వలను పూడ్చి పేదలకు స్థలాలు ఇవ్వడం కాదని, ప్రభుత్వానికి చెందిన నిరుపయోగ భూములను స్వాధీనం చేసుకుని నిజమైన లబ్ధిదారులకు అందించాలనే స్పష్టమైన దృక్పథంతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఎన్ని ఒత్తిళ్లు, అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా ప్రజా ప్రయోజనాల కోసం కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలు, నిరంతర సేవా కార్యక్రమాలు ఎమ్మెల్యే దంపతులను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాయి. అధికా రంలో ఉన్నప్పటికీ ప్రజల మధ్యే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించడం వల్ల ప్రజలు వారిని తమ కుటుంబ సభ్యు లుగా భావిస్తున్నారు.ప్రజాసేవను రాజకీయాలకు అతీతంగా భావిస్తూ, ప్రతి పేదవాడి జీవితంలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పనిచే స్తున్న డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ దంప తులు సత్తుపల్లి రాజకీయాల్లో సేవామూర్తులుగా నిలుస్తున్నారనే అభి ప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.పదవి శాశ్వతం కాదని,కానీ ప్రజల మనసుల్లో సంపాదించిన స్థానం శాశ్వతం అనే నానుడికి ఈ ఎమ్మెల్యే దంపతులు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సిపిపి దరఖాస్తులు ఎస్‌బిఐలో అందజేత




ప్రజాపక్షం/సత్తుపల్లిః ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనకర మైన కాంప్రహెన్సివ్ పెన్షన్ ప్రాజెక్టు దరఖాస్తులను మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సత్తుపల్లి బ్రాంచ్ మేనేజర్ సూర్య చంద్ర సాహుకి అంద చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సర్వీసు పెన్షనర్ల కొరకు అనేక ప్రయోజనాలతో కూడిన పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. వివ రాలు తెలుసుకున్న టి.యస్.జి.ఆర్.ఈ.ఏ. నాయకులు తొలి విడతగా నలభై దరఖాస్తులను బ్యాంకు మేనేజర్ కు అందజేశారు. సంఘ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, ప్రకాశరావు, నాయకులు సాంబశివరెడ్డి, బూరుగు దాసు, మధుసూదన రాజు, పూర్ణచంద్రరావు దరఖాస్తులు అందచేసిన వారిలో ఉన్నారు.

## సమస్యలకు నిలయాలుగా విద్యాలయాలు..!

**-కరెంట్ తీగలపై వేలాడుతున్న స్కూల్ బోర్డు**
**-శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్న తరగతి గదులు**
**-పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువు**
**-కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా పనులు**
**-మరుగుదొడ్లకు డోర్లు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు**











ప్రజాపక్షం/జూలూరుపాడుః జూలూరుపాడు మండలంలోని పలు సర్కారీ బడులు సమస్యలకు లోగిళ్లుగా మారాయి. ఈ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద, మధ్యతరగతి, బడుగు, బలహీనవర్గాలకు చెం దిన విద్యార్థులు అనేక సమస్యల నడుమ తమ చదువులు సాగిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నా ఎక్కడి సమ స్యలు అక్కడే తిష్ట వేస్తున్నాయి. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పరి స్థితిని తెలుసుకునేందుకు ప్రజాపక్షం ప్రతినిధి మంగళవారం పలు పాఠ శాలలను విజిట్ చేశారు. ఈ సందర్భంగా అనేక వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్ని చోట్ల మరుగుదొడ్లు ఉన్నా నీటిసౌకర్యం లేకపోవడం, నిర్వహణ సరిగా లేకపోవడం, పైకప్పులు ఊడిపోవడంతో వాటిని వినియోగించుకునే పరి స్థితి లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కొన్ని పాఠశాలల్లో మంచినీటి వసతి సరిగా లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో అసంపూర్తిగానే పనులు..**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రయత్నాలు చేస్తుంది. ప్రభుత్వ బడిలో సౌకర్యాలు లేకనే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నట్లు తెలుసుకున్న ప్రభుత్వాలు గతంలో మన ఊరు మనబడి, ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల అనే కార్యక్రమాలతో ప్రత్యేక నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. అయినా కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తయినా మరికొన్నింటిలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంతో పనులు మాత్రం అంసంపూర్తిగానే పనులు నిలిచిపోయాయి.

**శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్న తరగతి గదులు....**

జూలూరుపాడు మండల పరిధిలోని జడల చింత ప్రాథమిక పాఠశాలలో తరగతి గది శిథిలావస్థకు చేరి పుచ్చులూడి పడుతు న్నాయి. పక్క గదిలో చదువుతున్న విద్యా ర్థులు ఆదమరచి వస్తువు ఉన్న గదిలోకి వెళితే ఏ సమయంలో పెచ్చు లూడి పడతాయోనని బిక్కు బిక్కు మంటూ విద్యార్థులూ, ఉపాధ్యా యులు కాలం వెళ్ళదీస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా పెద్ద ప్రమాదం జరగక ముందే చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదం డ్రులు కోరుతున్నారు.

**కరెంటు తీగలపై వేలాడుతున్న స్కూల్ బోర్డు...**
**డోర్లు లేని మూత్ర శాలలు...**

మండల పరిధిలోని కొత్తూరు పంచాయతీలో హరిజనవాడ ప్రాథమిక పాఠశాల స్కూల్ బోర్డు కరెంటు తీగలపై వేలాడుతూ దర్శనమిస్తుంది. విద్యార్థుల మూత్రశాలలకు డోర్లు లేక ఇబ్బంది పడుతున్నారు. తాగు నీరు, మూత్ర శాలల్లో నీటి సౌకర్యం పూర్తిస్థాయిలో ఏర్పాటుకు నోచుకో లేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల మూత్రశాలల్లో నిల్వనీరు లేకుండా బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయలేదు. మూత్రశాలలో పనులు కూడా అసంపూర్తిగానే ముగించేశారు. దీంతో మూత్రశాలలు దుర్గం ధాన్ని వెదజల్లుతుండటంతో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదు. బుజ్జ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యుత్ సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మంచినీటి చేతి పంపు మరమ్మతులకు నోచుకోవడం లేదు, పాఠశాలకు వెళ్లే దారి నల్లరే గడి మట్టి దారి కావడంతో వర్షం పడితే విద్యార్థుల్లో లోపలికి వెళ్లే పరి స్థితి కనపడటం లేదు. పాఠశాల గదులు కాంక్రీట్ పగిలిపోయి దర్శన మిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి మండలంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల గదులు తొలగించి, నూతన గదులు ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని విధాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

## నిరుపేద, అనాథ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

**10 ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం**

ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యా పథకం కింద చదువుకుంటున్న విద్యార్థులలో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి ఉత్తీర్ణులైన వారి స్థానంలో కొత్త విద్యార్థుల చేరికకు అవకాశం కల్పిస్తున్నట్లు సామాజిక కార్యకర్త కర్నె రవి తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 10 ఉచిత సీట్ల భర్తీకి అర్హులైన నిరుపేద, అనాథ మరియు వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. మణుగూరు మండలంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం 79 మంది విద్యార్థులు ఈ ఉచిత విద్యా పథకం ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి సంవత్సరం పదో తరగతి పూర్తి చేసి బయటకు వెళ్లే విద్యార్థుల స్థానాల్లో కొత్త అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసే విధానం అమలులో ఉంది.

**అర్హులెవరు...?**

అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులుతల్లిదండ్రులు లేని అనాథ పిల్లలుఒంటరి తల్లి లేదా తండ్రి సంరక్షణలో ఉన్న విద్యా ర్థులుదివ్యాంగుల పిల్లలుసామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గా లకు చెందిన విద్యార్థులు. దరఖాస్తు విధానం...

అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు లిఖితపూర్వక దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి మణు గూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుంది. అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హత, ఆర్థిక పరిస్థితి మరియు నిబంధనల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క బాలుడు లేదా బాలిక కూడా విద్యకు దూరం కాకూడదు. ప్రైవేట్ పాఠశాలల్లో లభించే ఈ ఉచిత విద్యా అవకాశం పేద విద్యార్థుల జీవితాలను మార్చగలదు. ముఖ్యంగా తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు, అత్యంత నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలి. మీ పరిసర ప్రాంతాల్లో చదువుకు ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో విద్య కొన సాగించలేని పిల్లలు ఉంటే, వారికి ఈ సమాచారం చేరవేసి ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా సహాయం చేయండి. సమా జంలో ప్రతి చిన్నారికి విద్య అందించడం మనందరి బాధ్యత" అని కర్నె రవి పేర్కొన్నారు.

**ప్రజలకు విజ్ఞప్తి....**

మణుగూరు మండల ప్రజలు ఈ సమాచారాన్ని విస్తృతంగా పంచుకో వాలని, అర్హులైన నిరుపేద మరియు అనాథ పిల్లలకు ఈ అవకాశాన్ని అందించేందుకు సహకరించాలని కోరారు. ఆలస్యం చేయకుండా దర ఖాస్తులు సమర్పించి ఉచిత విద్యా అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయం, మణు గూరులో దరఖాస్తుల సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుదారులు ఆదాయ ధ్రువీకరణ పత్రం, అనాథ ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), ఆధార్ కార్డు, విద్యార్థి చదువు ధ్రువీకరణ పత్రం మరియు ఇతర సంబంధిత పత్రాలను జతచేసి దరఖాస్తు సమర్పించవలెను.

## యువత ఓటరు నమోదు చేసుకోవాలి



ప్రజాపక్షం/చంద్రుగొండ: 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులు తప్పని సరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసు కోవాలని ఎన్నికల శిక్షణాధికారులు ప్రసాద్, సత్యనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో బూత్ లెవల్ ఏజెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సర్వేలో ఎలాంటి ఓటును అన్యాయంగా తొలగించబోమని, ఇంటింటి పరిశీలన అనంతరం మాత్రమే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీఎల్ వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పని చేసి ఓటరు జాబితా సవరణలో జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీవో అశోక్, యూడీసీ మధు,ఆర్ఐ తిరుపతిరావు,రామారావు,రాజకీయపార్టీలప్రతినిధులు పాల్గొన్నారు

## ఆహార భద్రత శాఖ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని హోటళ్లు, బేక రీలు, కిరాణా దుకాణాలు, స్వీట్స్ షాపులు తదితర ఆహార వ్యాపార సంస్థల్లో జిల్లా ఆహార భద్రత నియంత్రణ అధికారి శరత్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భా గంగా ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, గడువు తేదీలు, నిల్వ విధానాలను అధికారులు పరిశీలించారు. పలు దుకాణాల్లో ఆహార నిర్వహణ తీరుపై వ్యాపారులకు సూచ నలు ఇచ్చారు. గడువు ముగిసిన ఉత్పత్తులను విక్రయించరాదని, ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి భద్రపరచాలని వ్యాపారు లకు అవగాహన కల్పించారు. అనుమానాస్పదంగా ఉన్న కొన్ని ఆహార నమూనాలను సేక రించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఆహార భద్రత అధికారి శరత్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయని, నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమ యంలో గడువు తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈతనిఖీల్లో ఆహార భద్రత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించవద్దు



ప్రజాపక్షం/దమ్మపేట: దమ్మపేట సెంటర్ ఇరు వైపులా ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించకుండా వారి జీవనోపాధి కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మం గళ వారం ఎంఎల్ఏ జారే ఆదినారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ దమ్మపేట సెంటర్‌లోని దుకాణాల యజ మానులు డ్రైనేజీ పూడికతీత పనులను స్వంతంగా కార్మికులను నియమించి నిర్వహిస్తూ గ్రామ పంచాయితీకి సహకరిస్తున్నారని తెలిపారు. పుట్‌పాత్‌పై వ్యాపారులు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు స్వల్ప పెట్టుబడితో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని పేర్కొ న్నాయి. అయితే గ్రామ పంచాయితీ అధికారులు పుట్‌పాత్ వ్యాపారులను తొలగించి వేరే ప్రాంతానికి తరలిస్తామని, నాలుగు రోజులలోపు దుకాణాలు ఖాళీ చేయాలని సూచిస్తున్నా రని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న కార్మికులను బల వంతంగా తొలగించరాదని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఏ జారే ఆదినారాయణను కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీ నర్ మురహరి రఘు, నాయకులు పుల్లారావు,యుగంధర్, సుమన్, నాగరాజుపాల్గొన్నారు.

## దొడ్డా సత్యావతిని పరామర్శించిన నున్నా



ప్రజాపక్షం/దమ్మపేట: దమ్మపేట మండల పరిధిలోని నాయుడుపేట గ్రామానికి చెందిన సీపీఎం మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మీ నారాయణ తల్లి దొడ్డా సత్యావతి అనారో గ్యంతో బాధపడుతూ స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సోమవారం ఆమెను పరామర్శించారు. ఈసం దర్భంగా సత్యావతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి రంగారావు, మెరుగు సత్యనారాయణ, దమ్మపేట మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివా సరావు, సత్తుపల్లి టౌన్ కార్యదర్శి కొలికిపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘం ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్ రావుల రాజబాబు, పార్టీ నాయకులు ఎర్రా గోపి, దమ్మపేట మండల కమిటీ సభ్యులు కొలికిపోగు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇసుక వేలం

ప్రజాపక్షం/చింతకాని : ఎలాంటి అనుమతుతలు లేకుండా అక్రమంగా రవాణా చేసి పం దిళ్లపల్లి గ్రామంలో బండ్ల అప్పారావు భూమిలో నిల్వ చేసిన (19) ట్రాక్టర్ల(57) క్యూబిక మీటర్ల ఇసుకను మైనింగ్ వారి దేశాల ప్రకారం బధవారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం చింతకాని తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక వేలం జరుగుతుందని చింతకాని తహసీ ల్దార్ బాబ్జీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు బుధవారం ఉదయం 11 గంటలకు చింతకాని తహసీల్దార్ కార్యాలంలో జరిగే వేలం పాటలో పాల్గొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం నగదును చలానా ద్వారా చెల్లించి పొందవచ్చన్నారు.

# పోషకాహారం అందించడంలో ఎలాంటి రాజీ వద్దు



**-ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీలపై కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయి సమీక్ష**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించడంలో ఎలాంటి రాజీ వద్దని, రికార్డులు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి మండలంలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వ పాఠశాలలు, ఫ్రీ ప్రైమరీ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా పెద్ద వెంకటాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు నమోదు రిజిస్టర్‌లు, మధ్యాహ్న భోజన పతకం అమలు తీరు, మెనూ పాటింపు వంటి అంశాలను స్వయంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాస్థాయిని పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ చిన్నారులకు అందుతున్న పోషకాహార సేవలు, గుడ్లు, పాలు, బాలామృతం పంపిణీ విధానం, గర్భిణీల, బాలింతలకు అందుతున్న సేవల రికార్డులను వివరంగా తనిఖీ చేశారు. అనంతరం లక్ష్మీపురం గ్రామం వద్ద కుంగిన కల్వర్టును కూడా ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రమాదకరంగా మారిన ఆ కల్వర్టు వల్ల ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించారు. వెంటనే స్పందించిన కలెక్టర్, సమస్యను తక్షణమే పరిశీలించి శాశ్వత పరిష్కారం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు పూర్తి స్థాయిలో చేరేలా మండల అధికారులు బాధ్యతగా పని చేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పల్లెల అభివృద్ధి : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఏన్కూరు:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మారావుపేటలో మంగళవారం ఆయన విద్యుత్ శాఖ ఏడి కార్యాలయం ప్రారంభం, ఐటీడీఏ ఇండ్ల పట్టాల పంపిణీ, షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం 60లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తదుపరి బురద రాఘవాపురం గ్రామంలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎంఎల్ఏ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. తిమ్మారావుపేటలో ప్రజలకు విద్యుత్ శాఖ కార్యాలయాలు అందుబాటులో ఉండేలా ఏడి, వీఆర్వో కార్యలయాలను కొత్తగా మంజూరు చేయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలు పూర్తిగా తొలగాలయని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, డీఈ వై రమేష్, ఏడీఏ ఎండి యాసిన్, ఏఈలు ఉమాకాంత్, వెంకన్న, ఏన్కూరు, కారేపల్లి అధికారులు, తిమ్మారావుపేట సర్పంచ్ గుగులోత్ సుమలత, ఉప సర్పంచ్ గొంది శ్రీను, బురద రాఘవాపురం సర్పంచ్ సాగబోయిన రాణి, ఉప సర్పంచ్ బరపటి వెంకటనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరామ్ నాయక్, ఏ బ్లాక్ అధ్యక్షులు వేముల కృష్ణ ప్రసాద్, మండల నాయకులు మేడా ధర్మారావు, మేడికొండూరు ప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, మొగిలి నాగరాజు, వీరు నాయక్, కనిశెట్టి వెంకన్న, గుర్రం రవి, తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక అక్షరాభ్యాసాలు





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో మండల పరిధిలోని కొర్లబోడుతండా పాఠశాలలో హెచ్ఎం టిఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం పూల్ చంద్, సర్పంచ్ భూక్యా చిన్నయ్య నాయక్, ఉప సర్పంచ్ బీమ్లా నాయక్, పంచాయతీ కార్యదర్శి రూపాదేవి, ఉపాధ్యాయులు గుర్రం కేశవరావు తదితరులు పాల్గొ న్నారు. అదేవిధంగా గణేశ్వరం పాఠశాలలో ఒకటవ తరగతిలో చేరిన పది మంది విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఖమ్మం నగరంలోని రవికాంత్ మెడికల్ బాధ్యులు రవి, వారి తండ్రి వైకుంఠం జ్ఞాపకార్థం చిన్నారులకు పలకలు, బలపాలను అందజేశారు. మూడు సంవత్సరాలుగా వారు అందజేస్తున్నట్లు ఉపాధ్యాయులు గోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనివాసరావు, హెచ్ఎం ఎస్‌కె రఫీక్ పాషా, పంచాయతీ కార్యదర్శి పవిత్ర, ఉపాధ్యాయులు గోపాలరావు, వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు రాధ, ఆయాలు సోబిలి, ప్రియాంక, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్ చెక్‌పవర్ రద్దుపై ప్రభుత్వం స్పందించాలి





**ప్రజాపక్షం/చింతకాని :** ఉపసర్పంచ్ చెక్ పవర్ రద్దుపై వస్తున్న వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని జిల్లా ఉపసర్పంచ్‌ల అసోషియేషన్ ఇంచార్జ్ అబ్బూరి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చింతకాని మండలం రాఘవాపురం బృందావన్ గార్డెన్స్‌లో జరిగిన చింతకాని మండల ఉపసర్పంచ్‌ల సమావేశంలో రాఘవాపురం ఉప సర్పంచ్ అబ్బూరి మహేష్ మాట్లాడుతూ చెక్ పవర్ రద్దుపై వస్తున్న వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఉపసర్పంచ్‌లకు నెలకు రూ.5వేల గౌరవ వేతనం ఇవ్వాలని, వార్డు సభ్యులకు రూ.3వేల గౌరవవేతనం ఇవ్వాలని, గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్‌కు ప్రత్యేకంగా కుర్చీ, ఛ్రీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పనుల ప్రారంభ శిలాఫలకాల్లో ఉపసర్పంచ్‌ల పేర్లు పొందుపర్చాలన్నారు. ఈ నెల 25న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం చింతకాని మండల ఉపసర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వంగూరి రమేష్(గాంధీనగర్ కాలనీ), ఉపాధ్యక్షుడిగా చిట్టిమోదు రాంబాబు(కొదుమూరు), ప్రధాన కార్యదర్శిగా కూచిపుడి బుచ్చిబాబు(తిమ్మినేనిపాలెం), సహాయ కార్యదర్శిగా తంగిరాల మాధవి(చిన్నమండవ)తో పాటు మరో 5గురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో అంబటి శరత్, పోట్ల సీతయ్య, చంద్రకాని నర్సింహారావు , బండి రమేష్, గోగుల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# బి ఫార్మసీ విద్యార్థినికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బి ఫార్మసీ చదువుతున్న విద్యార్థిని కి ఆర్థిక చేయూత అందించారు. వేగినాటి దీపిక బి ఫార్మసీ చదివేందుకు ఆర్థిక స్థోమత లేక చదువును ఆపి వేసిన విషయాన్ని తెలుసుకున్న హెల్పింగ్ హ్యాం డ్స్ సభ్యులు బి ఫార్మసీ పూర్తి చేసేందుకు కళాశాలకు చెల్లించాల్సిన నాలుగు సంవత్సరాల ఫీజును చెల్లించేందుకు ముందుకు వచ్చింది. అందులో భాగంగా మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మద్దినేని ప్రసాదరావు కమల దంపతుల ఆర్థిక సహకారంతో మూడవ సంవత్సరం ఫీజు రూ. 35వేల చెక్కును దీపికకు అందజేశారు. ఈ సందర్భంగా మద్దినేని ప్రసాదరావు, కమల దంపతులను పిఆర్‌పిఏ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యం లో సత్కరించి కృతజ్ఞతాభివందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ బాధ్యులు, పిఆర్‌పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు, కొంగర పురుషోత్తమరావు, చావా రమేష్‌బాబు, సిరిపురపు రమణారావు, ఆళ్ల వెంకట్రావు, తాళ్లూరి గోపాలరావు, కొండలరావు, బి.కోటేశ్వరరావు, కొత్తా శ్రీనివాసరావు, సీతారామయ్య, తాతా రాఘవయ్య, డివిఎన్ ప్రసాద్, ఎంఏ హమీద్, పారుపల్లి వెంకటేశ్వరరావు, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటి:** మధిర లోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఇందుకు గాను అన్నదాతలు ఎలగందుల కిశోర్ భారతి దంపతుల కుమారుడు జశ్విన్ తన జన్మదినం పురస్కరించుకొని అన్నదానం చేసినట్లు, భూమిపట్టి విష్ణు సతీమణి రాయపూడి లక్ష్మయ్య జ్ఞాపకార్థం అన్నదానం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్‌మోహనరావు, వెచ్చ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతోనే ఆరోగ్యం




**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** యోగాతోనే ఆరోగ్యమని వైద్యురాలు జాహ్నవి, యోగ శిక్షకుడు గణేశ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళ వారం అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు,చిన్నారులకు యోగా ప్రాముఖ్యతలు, తీసుకోవాల్సిన పోషకాహారం తదితర అంశాలపై మెలకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి వైద్యాధికారి వెంకట్‌లాల్, ఆయుష్ విభాగం సిబ్బంది కందుల రాంబాబు, ఏఎన్ఎం విజయకుమారి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు జీ.రాణి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యను అందిస్తున్నదని, ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంగాపురం తండా సర్పంచి అశోకరాణి సూచించారు. స్థానిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహకాలను అందుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రైవేటు మోజులో పడి పిల్లలు జీవితాలను నాశనం చేసుకోవద్దని, ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరువుమాదారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, రాజారాం సొసైటీ ఛైర్మన్ ధీరావత్ బాలాజీ, ప్రధానోపాధ్యాయుడు నందిగాం ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి వారి హుండీల లెక్కింపు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీలను జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఏ.రత్నప్రభ పర్యవేక్షణలో లెక్కించారు. 92రోజులకు గాను రూ. 52.95430 లక్షలు వచ్చినట్లు ఈఓ జగన్మోహనరావు తెలిపారు. బంగారం, వెండి వస్తువులతో పాటుగా విదేశీ కరెన్సీ కూడా స్వామి వారి హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ ఉప్పల విజమ దేవశర్మ, మురళి మోహన శర్మ, సీనియర్ అసిస్టెంట్ డీ.సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఈ.కృష్ణ ప్రసాద్, ఆలయ అర్చకులు, సిబ్బంది, శ్రీ వెంకటేశ్వర సేవాసమితి సభ్యులు, శ్రీ సత్యసాయి సేవా సభ్యులు పాల్గొన్నారు.

# గెస్ట్ ప్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల రఘునాథపాలెం పాఠశాల నందు గెస్ట్ ప్యాకల్టీ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్వో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ పిజిసిఆర్‌టి పోస్టు భర్తీ కొరకు యంయస్సి బోటనీ, బిఈడి అర్హత కలిగిన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మెరిట్ ప్రాతిపదికన పోస్టును భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 18సాయంత్రం లోపు దరఖాస్తులను కెజిబివి రఘునాథపాలెం పాఠశాలలో సమర్పించాలని ఎస్వో సూచించారు.

# నీటి పారుదల ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం చేయాలి



**- జిల్లా కలెక్టర్ అంకిత్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని వివిధ నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరిగతగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావుతో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, భూ సేకరణ శాఖల అధికారులతో సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్, సీతమ్మ సాగర్ బహుళార్ధక ప్రాజెక్టు, పులుసుబొంత ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ, పెండింగ్ అనుమతులు, సమస్యల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మండలాల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటు చేసుకుండా, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణ పనుల కోసం అదనపు సర్వేయర్లను కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర అవగానతో పనిచేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతితో జిల్లాలో అభివృద్ధి కీలకమని, అందుకే ప్రతీ అధికారి బాధ్యతగా పనిచేసి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యుటీ కలెక్టర రవీంద్రనాధ్, డిఆర్ఓ పద్మావతి, ఆర్‌డిఓ మధు, సంబంధిత మండలాల తహాశిల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, భూ సరే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాకు న్యాయం చేయండి

**-పంటలు నాశనం, జీవనోపాధి కోల్పోయాం : బాధిత రైతుల ఆవేదన**

**-నాగినేనిప్రోలు రెడ్డిపాలెం ప్రాంతంలో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భూములు నష్టపోయామని, పరిశ్రమల కాలుష్యంతో జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటోందని నాగినేనిప్రోలురెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రైతులు కలెక్టర్, సబ్ కలెక్టర్‌లను కలిసి వినతి పత్రం సమర్పించారు. తమకు తక్షణ నష్టపరిహారం అందించాలని, బాధిత కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రైతులు దరావత్ మమత, పాగా రామామూర్తి, పాగా వెంకటేశ్వర్లు, చెంచాలపు శ్రీను, చెంచాలపు సత్యనారాయణ, చెంచాలపు స్వరూప, టి జ్యోతిలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు కలుషిత రసాయన నీటి నమూనాలు, ఫోటోలు, మొసళ్ల సంచారానికి సంబంధించిన ఆధారాలు, అలాగే పాత పత్రికా క్లిప్పింగులను అధికారులకు సమర్పించినట్లు తెలిపారు.



**నాగినేనిప్రోలు రెడ్డిపాలెం ప్రాంతంలో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన...**

జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు వెంటనే స్పందించారు. గ్రౌండ్ వాటర్ అధికారి తిరుపతి, వ్యవసాయ మండల అధికారి ఆర్ శంకర్, జీపీవో బుల్లారావులు బాధిత రైతులతో నాగినేనిప్రోలు రెడ్డిపాలెం ప్రాంతంలోని సర్వే నెంబర్ 47,48 భూములను పరిశీలించారు. అలాగే గోదావరి ఒడ్డున సుమారు 20 నుంచి 30 ఎకరాల పరిధిలో ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యం ద్వారా ఆక్రమణ జరిగినట్లు ఈ సందర్భంగా రైతులు ఆరోపించారు. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన నీటి వల్ల పంటలు దెబ్బతింటున్నాయని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలనలో భాగంగా అధికారులు నీటి నమూనాలు, మట్టి శాంపిళ్లు సేకరించి, పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

# బడిబాటతో ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల మొగ్గు



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం చుంచుపల్లి మండలంలో మంచి ఫలితాలను ఇస్తోందని చుంచుపల్లి యం.ఈ.ఓ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాబు క్యాంప్ ప్రాధానోపాధ్యాయురాలు నీరజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా జి.హెచ్.ఎస్ బాబుక్యాంప్‌లో ఇప్పటి వరకు సుమారు 30 మంది విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. 8 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు పొందారని, వారిలో 4 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలకు మారి చేరడం విశేషమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం, మెరుగైన మౌలిక వసతులపై ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారని, దీంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై ఆసక్తి



చూపుతున్నారని అన్నారు. జిహెచ్ఎస్ బాబు క్యాంప్ పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికవ్వడంతో నూతన శోభ వచ్చిందని, మౌలిక సదుపాయాలు సమకూరాయని అన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లు స్కూల్‌లో ఉన్నాయని అన్నారు. పీఎం శ్రీ పథకం ద్వారా విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. గత సంవత్సరంలో స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 215 కాగా ఈ సంవత్సరం 250 లక్ష్యం కలిగియున్నామని అన్నారు.

# నేడు వైరాలో సుడా చైర్మన్ పువ్వాళ్లకు అభినందన సభ

**భారీ ఏర్పాట్లు చేసిన కాంగ్రేస్ శ్రేణులు**



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం సూడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారి వైరా మండలానికి వస్తున్న సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌కు వైరా మండల, పట్టణ కాంగ్రేస్ అధ్వర్యంలో కమ్మవారి కళ్యాణ మండపంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ అభినందన సభకు కాంగ్రేస్ శ్రేణులు భారీగా ఏర్పాటు చేశారు. వైరా నివాసి కాంగ్రేస్ పార్టీలో సుదీర్ఘంగా సేవలందిస్తూ జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించి సుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అభినందన సభకు సంబంధించి ఏర్పాట్లను కాంగ్రేస్ నాయకులు భారీగా చేశారు. పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటుతో పాటు రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరిని అభినందన సభకు ఆహ్వానించారు. భట్టివిక్రమార్క అనుచరుడైన దుర్గాప్రసాద్ తన రాజకీయ ప్రస్తావాన్ని భట్టితోనే కొనసాగిస్తూ కాంగ్రేస్ పార్టీ అభివృద్ధిలో తనకంటూ ప్రత్యేక ముద్రు వేసుకున్నారు. రెండుసార్లు వరుసగా జిల్లా అధ్యక్షుడు చేసిన దుర్గాప్రసాద్ వైరా మండలంలో కాంగ్రేస్ పార్టీని అభివృద్ధి పథంలో నడిపాడనే చెప్పవచ్చును. నేడు జరిగే అభినందన సభకు పలువురు రాజకీయ వ్యాపార ప్రముఖులు కూడా హాజరుకానున్నట్లు కాంగ్రేస్ వర్గాలు చెబుతున్నాయి.

# పెద్దమ్మతల్లి గుడి నూతన ఈఓగా విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/పాల్వంచ :** పెద్దమ్మతల్లి దేవాలయ కార్యనిర్వాహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎన్. రజనీకుమారి బదీలీపై వెళ్ళారు. వరంగల్ భద్ర కాళీ దేవస్థానంలో సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అద్దెంకి విజయ్‌కుమార్ పదోన్నతిపై పెద్దమతల్లి గుడి ఈఓగా వచ్చారు. మంగళవారం ఉద్యోగ బాద్యతలు తీసుకొన్నారు.

# ఒడిశా నుంచి గంజాయి అక్రమ రవాణా

**-సారపాకలో ఇద్దరు యువకులు అరెస్టు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** ఒడిశా రాష్ట్రం నుంచి ములుగు జిల్లా మంగపేటకు గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మంగళవారం సారపాక పల్లె ప్రకృతి వనం సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మేడా ప్రసాద్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన బజాజ్ పల్సర్ బైక్‌ను ఆపి తనిఖీ చేయగా గంజాయి రవాణా చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ 1,05,000 ఉంటుందని ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు. నిందితులను మంగపేట మండలానికి చెందిన బడే భరత్, ఉప్పరపల్లి వెంకటేష్‌గా గుర్తించినట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి రవాణా ముఠాలపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని, తనిఖీలు కొనసాగుతాయని ఎస్ఐ స్పష్టం చేశారు.

# వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డా.తుకారామ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం, ప్రభుత్వ కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహించడం. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం చేయడం వంటి కార్యక్రమాలపై శ్రద్ధ పెట్టాలన్నారు. హై రిస్క్ ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

# తొలిరోజు టెట్ ప్రశాంతం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో మంగళవారం తొలిరోజు నిర్వహించి టెట్ పరీక్ష విజయవంతంగా ముగిసింది. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముదస్తు చేసిన నిర్వహణతో ప్రశాంతంగా పరీక్ష ముగిసినట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. పాల్వంచలోని అనుబోస్ కాలేజీలో నిర్వహించిన మొదటి, రెండు విడతల్లో 290 హాజరు కావాల్సి ఉండగా, 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలో తాగునీటితోపాటు మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు సిసి కెమేరాల పర్యవేక్షణ కొనసాగినట్లు కలెక్టర్ తెలిపారు.

# ఎరువుల యాప్ నేడు ప్రారంభం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతులకు యూరియా మస్యను రూపుమాపేందుకు ప్రభుత్వం సిద్ధం చేసి యాప్‌ను నేడు జిల్లాలో కలెక్టర్ అంకిత్ ప్రారంభించనున్నారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్లలో నుండి యూరియాను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. బుకింగ్ అనంతరం జారీ అయ్యే ఐడి ఆధారంగా సమీప ఎరువుల విక్రయ కేంద్రాల్లో యూరియా పొందవచ్చు. ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంపొందించేందుకు, రైతులకు సకాలంలో యూరియా అందించడమే ఈ యాప్ ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# రాజారావుకు తాటి నివాళి



**ప్రజాపక్షం/ములకలపల్లి :** మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో ఓ పత్రిక రిపోర్టర్ ఇనుకుర్తి రామాచారి తండ్రి ఇనుకుర్తి రాజారావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు మంగళవారం వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముదిగొండ శ్రీను, పోతుగంటి లక్ష్మణ్, బండి కొమరయ్య, సుభాని, రాంబాబు, రఫీ, చారి, తోట కొండా, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్ర.జూ.కళాశాలల్లో మరమ్మత్తులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేపడుతున్న పలు మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసిలో జూ.కాలేజీల ప్రిన్సిపల్లు, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 14 ప్ర. జూ. కాలేజీల్లో సుమారు రూ.3.31 కోట్ల అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్న విద్యుదీకరణ, మరుగుదొడ్ల మరమ్మత్తులు, నూతన తరగతి గదుల నిర్మాణం, భవనా మర్మత్తులు, ఇతర మౌళిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాలేజీల్లో విద్యార్థుల చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, పిఆర్ ఇఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలి





**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం వైరాలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. వైరా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ, వార్డ్, ఓపి రూమ్, ల్యాబ్, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, సిబ్బంది, పనితీరు, రోజువారి కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారి నివేదికలను , ఔష దాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తే ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసరపు సి–కనెక్షన్ ఆపరేషన్ చేయవద్దని అన్నారు. వార్డులో కేసు షీట్లను పరిశీలిస్తూ రోగులకు అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి, అన్ని రకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి రోగులకు సౌకర్యవంతమైన వాతావరణ కల్పించాలని అన్నారు. అంతకు ముందు వైరా మండల కేంద్రంలో నూతనంగా రూ.37.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో సమన్వయ సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం వైద్య రంగాల అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని ముందుకు సాగుతుందని తెలిపారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకొని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

**-డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామారావు**




**ప్రజాపక్షం/ఖమ్మం:** ఆశాలు గ్రామాల్లో ప్రజలందరికీ వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి రామారావు అన్నారు. ఖమ్మంలో నిర్వహించిన ఆశ నోడల్ ఆఫీసర్ల సమావేశంలో నోడల్ అధికారులను ఉద్దేశించి మంగళవారం మాట్లాడారు. నేటి నుంచి ప్రారంభమైన స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2026 కార్యక్రమంలో ఆశా కార్యకర్తలందరూ చురుకుగా పాల్గొని గ్రామాలు, వార్డుల్లో ప్రజలకు పారిశుద్ధ్యం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ఒఆర్ఎస్ ద్రావణం వినియోగం, జింక్ మాత్రల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. దీంతో పాటు ఈ నెల 28,29,30 తేదిలల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి ఆశా కార్యకర్తలు ఆరోగ్య సిబ్బందితో సమన్వయంలో పనిచేసి, 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలుచేసి లక్ష్యంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం డాక్టర్ రామారావు ఖమ్మం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా అవసరమైన సూచనలు చేశారు. అదేవిధంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్, పల్స్ పోలియో కార్యక్రమం మరియు జాతీయ నులిపురులు నిర్మూలన దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సంబంధిత సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆయన ఆదేశించారు.

# హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రామకృష్ణ





**ప్రజాపక్షం/ ఖమ్మం :** మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంతో ఏర్పడిన ఎస్అండ్ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా నానబాల రామకృష్ణ , ప్రధాన కార్యదర్శిగా అర్వపల్లి నగేష్ లు ఎన్నికయ్యారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విద్య, వైద్యం, ఉపాధి, మహిళలు, పిల్లలు, దివ్యాంగుల హక్కుల కోసం తాము పోరాడతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# రైతాంగ సమస్యలను పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారిణి ఎం.రాధకు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రాల్లో మక్కలను విక్రయించి నెలలు గడుస్తున్నా..బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. వర్షాకాల సీజన్ ప్రారంభమైనా రైతుభరోసా నిధులు జమ కాక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. పాస్ పుస్తకాలకు సంబంధం లేకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని, నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని కోరారు. తక్షణమే యూరియాకై ఏర్పాటు చేసిన యాప్‌ను, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నల్ల చట్టాలను రద్దు చేయాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల, అధ్యక్ష, కార్యదర్శులు ఇంటూరి అశోక్, రచ్చ నరసింహారావు, నాయకులు మారుతి కొండలరావు, ఎడ్ల తిరుపతిరావు, ఎరదేశి నరసింహారావు, భూక్య కృష్ణ, మందడపు మురళీకృష్ణ, ఎలమద్ది లెనిన్, సామల మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన సుడా ఛైర్మన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌ను సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్‌ను సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సుడా పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందజేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం, అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాలపై చర్చించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రాంత సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

# లక్ష్మినారాయణకు ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ అనుబంధ ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణకు ఖమ్మంజిల్లా కాపు సంఘం అండగా నిలబడింది. కాపు సంఘం ఆధ్వర్యంలో లక్ష్మినారాయణకు ఆర్థిక చేయూతనిచ్చారు. లక్ష్మినారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు గొంతుకు సంబంధించిన చికిత్స జరిగింది. ఆర్థిక సాయం అందించిన వారిలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, నాయకులు పొదిల రవికుమార్, పొన్నం వెంకటేశ్వర్లు, ఆర్‌జెసి కృష్ణ, పాలెపు వెంకట రమణ, రాపర్తి శరత్‌కుమార్, శెట్టి రంగారావు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష




**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. 2019 నుండి ఇప్పటి వరకు జూనియర్ న్యాయవాదులకు హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు రెన్యువల్ చేయాలని ఖాళీగా ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిపి, ఏజిపి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్షలు చేపట్టారు. సెక్షన్ 35 బిఎన్ఎస్ఎస్ వంటి అంశాలు సవరించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, కార్యదర్శి కొప్పుల రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన రిలే నిరాహార దీక్షలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, మందడపు శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు ఓరుగంటి శేషగిరి, ఏడునూతల శ్రీనివాసరావు, బి. తిరుమలరావు, తాళ్లూరి దిలీప్,దిరిశాల కృష్ణారావు,మాజీఅధ్యక్షులువెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# కల్లూరులో హాస్టల్స్ బడిబాట



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ఎస్సీ, బీసీ, ఎస్టీ ,వసతి గృహాల సంక్షేమ అధికారులు హాస్టల్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వసతి గృహాల సంక్షేమ అధికారులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విద్యార్థులను వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని కరపత్రాలు పంపిణీ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన కల్పించి అడ్మిషన్లు చేర్పించుకుంటున్నారు. మండల పరిధిలోని చిన్న కోరుకొండి లో వెంకటేశ్వరరావు, కల్లూరులో ఎస్సీ వసతి గృహంలో రామకృష్ణ ,బీసీ వసతి గృహంలో శివాని, గిరిజన ఆశ్రమ పాఠశాలలో శ్రీనివాస్ లు గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థుల వివరాలను తీసుకుని గృహ సందర్శన చేస్తూ విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న పలు సంక్షేమ పథకాలను పౌష్టికాహారం మెనూ తోపాటు పుస్తకాలు ఏకరూప దుస్తులు, ట్యూటర్లు అనేక సంక్షేమ పథకాలను వారికి అందిస్తుందని, విశాలమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలను చదివిస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామని, నిరంతర పర్యవేక్షణలో ఉంటూ ఉన్నామని, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ తమ వసతి గృహాల్లో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, క్రమశిక్షణ పద్ధతిని అలవాటు చేస్తూ ప్రత్యేక పర్యవేక్షణతో అన్ని సౌకర్యాలను అందిస్తున్నామని, వసతి గృహాల సంక్షేమ అధికారులు వసతి గృహాల అధికారులు హాస్టల్స్ బాట పట్టారు. దీంతో విద్యార్థుల సంఖ్య క్రమేపి పెరుగుతుందని వారు వివరించారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేపై ధర్నా.. కేసు నమోదు..



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఓబుల్ రావు బంజర వద్ద మంగళవారం ఉదయం గ్రీన్ ఫీల్డ్ హైవేపై రెండు పాడి గేదెలు చనిపోవడంతో విషయం తెలుసుకున్న స్థానికులు సుమారు గంట పాటు ధర్నా చేయడంతో హైవేపై ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడటంతో కల్లూరు ఎస్సై సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు. తమ పాడి గేదెలను, పశువులు ను ఎప్పటికప్పుడు కాసుకోవాలని, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని కొమ్ములకు స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగి ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని అంతేకానీ హైవేపై ధర్నాలు చేయడం వలన ప్రయాణికులు వాహనదారులు ఇబ్బంది పడతారని ఎస్సై వివరించారు.

# ఖాతాలో కళాకారుడి డబ్బులు మాయం.!

**- న్యాయం చేయండి..కళాకారుడి ఆవేదన**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** కళాకారుల పింఛన్‌తో జీవనం గడుపుతున్న కళాకారుడి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమయ్యాయి. ఈ మేరకు బాధిత కళాకారుడు ఏపూరి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నేలకొండపల్లి మండలం పరిధిలోని చెరువు మాదారానికి చెందిన ఆయన ఖాతా నుంచి రూ.21,500లు డ్రా చేశారని, ఇటీవల బకాయి పింఛన్ మొత్తం రూ.90వేలు తన ఖాతాలో జమ చేశారు. కాగా ఆ మొత్తం నుంచి రెండు పర్యాయాలుగా రూ.69,400లు డ్రా చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం మంగళవారం డబ్బులు అవసర నిమిత్తం ఏటీఎం కి వెళ్లి చూడగా జీరో బ్యాలెన్స్ చూపిస్తుందన్నారు. అనమానంతో స్టేట్‌మెంట్‌ను పరిశీలిస్తే డ్రా చేసిన విసయం తెలుసుకుని అవాక్కయ్యారు. మిగతా సొమ్మును తనకు తెలియకుండానే రూ.21,500లు పలుమార్లు ఏటీఎం ద్వారా డ్రా చేశారని, గత నెల15న రూ.4,500, 18న రూ.5వేలు, 23న రూ.10వేలు మరో మారు రూ.1లను ఏటీఎం ద్వారా డ్రా చేశారు. ఈ నగదు మొత్తం ఖమ్మంలోని ఓ ఏటీఎంలో డ్రా చేసినట్లు స్టేట్‌మెంట్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కళాకారుల పింఛన్‌తో జీవిస్తున్న తమ ఖాతా నుంచి గుర్తు తెలియని దుండగులు మాయం చేశారని, సమగ్ర విచారణ చేసి తమ నగదును రికవరీ చేయాలని సైబర్ పోలీసులను ఆశ్రయించారు.